
స్టేడియం.. నిర్వహణ లోపం

- వాలీబాల్ కోర్టులో మట్టికుప్పలు
- స్టోర్ రూమ్‌లుగా బాత్‌రూంలు
- సమస్యల వలయంలో పీజేఆర్ స్టేడియం





వాలీబాల్ కోర్టు

హఫీజ్‌పేట్: పీజేఆర్ స్టేడియం సమస్యల్లో కొట్టుమిట్టాడుతోంది. వాలీబాల్ కోర్టులో మట్టికుప్పలు దర్శనమిస్తుండగా.. బాడ్మింటన్ కోర్టులో మ్యాట్ పూర్తిగా చిరిగిపోయింది. క్రీడా వస్తువులను ఎక్కడపడితే అక్కడ పడేశారు. మరుగుదొడ్లు కంపు కొడుతున్నాయి. స్టేడియంలో నిర్వహణ లోపంతో క్రీడాకారులు, వాకర్స్ ఇబ్బందులుపడుతున్నారు. ఈవెంట్స్‌పై ఉన్న శ్రద్ధ నిర్వహణపై ఉండడం లేదని వాకర్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని క్రీడాకారులు ఆందోళన చెందుతున్నారు. వివరాలిలా.. జీహెచ్‌ఎంసీ పరిధిలోని శేరిలింగంపల్లి జోన్ చందానగర్‌లో పి.జనార్దన్‌రెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను



బాత్‌రూమ్‌లో పనికిరాని సామగ్రి



సింకుల వద్ద అపరిశుభ్రత

కోట్లాది రూపాయలతో నిర్మించారు. వివిధ రకాల ఆటలకు క్రీడా మైదానాలు సైతం నిర్మించారు. స్థానికులు, క్రీడాకారులు, చిన్నారులు, వృద్ధులు యోగా, వాకింగ్, బాడ్మింటన్, జిమ్, వాలీబాల్, టెన్నిస్ తదితర క్రీడలకు వస్తుంటారు. ఇక వేసవి కాలంలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో చిన్నారులకు క్రీడలపై శిక్షణ తరగతులు నిర్వహిస్తుంటారు. ఐతే ఇష్టానుసారంగా ఈవెంట్స్‌కు అనుమతులు ఇస్తున్నారని దీంతో టెంట్‌లు, బారికేడ్లు, వాకింగ్ ట్రాక్‌లో అడ్డుగా వేస్తున్నారని వాకర్స్ వాపోతున్నారు. ఐతే నిర్వహణలోపంతో స్టేడియం అస్తవ్యస్తంగా తయారైందని పలువురు విమర్శిస్తున్నారు.



స్టేడియంలో ధ్వంసమైన రెయిలింగ్

- వాలీబాల్ కోర్టులో మట్టికుప్పలు ఉండగా.. బాడ్మింటన్ కోర్టులో మ్యాట్ పూర్తిగా చిరిగిపోయింది.
- మరుగుదొడ్లలో సింక్‌లు తదితరాలు పగిలిపోగా పరిసరాలు కంపుకొడుతున్నాయి.
- బాత్‌రూమ్‌లను స్టోర్ రూమ్‌లుగా వాడుతున్నారు. క్రీడా వస్తువులను ఎక్కడపడితే అక్కడ పడేశారు.
- విద్యుత్ బోర్డులు ధ్వంసం అవడంతో వైర్లు వేలాడుతున్నాయి.
- వాహనాలకు పార్కింగ్ లేక ఇష్టానుసారంగా ఎక్కడపడితే అక్కడ నిలుపుతున్నారు.
- స్టేడియంకు వచ్చే వారికి కనీసం తాగడానికి మంచినీరు లేదు
- మెట్ల రెయిలింగ్‌తో పాటు పైపులు ధ్వంసం అయ్యాయి
- వాకర్స్‌కు సరైన వాకింగ్‌ట్రాక్ లేక ఖాళీ స్థలంలో వాకింగ్ చేస్తున్నారు.

నిర్లక్ష్యం కనపడుతోంది..



పీజేఆర్ స్టేడియంలో కనీస వసతులపై అధికారుల నిర్లక్ష్యం కనపడుతోంది. జీహెచ్‌ఎంసీ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకునే వారు లేరు. మరుగుదొడ్లు పూర్తిగా పాడయ్యాయి. సిబ్బంది కనబడడం లేదు. ఉన్నతాధికారులు పీజేఆర్ స్టేడియం నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి.

– రఘునందన్‌రెడ్డి, చందానగర్

ప్రైవేట్ ఈవెంట్స్‌కు అనుమతులు ఇవ్వొద్దు



జీహెచ్‌ఎంసీ అధికారులు ఇష్టానుసారంగా ప్రైవేట్ ఈవెంట్స్‌కు అనుమతులు ఇవ్వడంతో ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈవెంట్‌కు సంబంధించిన సామగ్రి ఎక్కడపడితే అక్కడ పడేసి వెళ్తున్నారు. స్టేడియం నాశనం అవుతోంది. ఉన్నతాధికారులు ఈవెంట్స్‌కు అనుమతులు ఇవ్వకూడదు.

– రమణమూర్తి, చందానగర్

ఏప్రిల్ 9న ఉగాది

పటాన్‌చెరు టౌన్: తెలుగు ప్రజల నూతన సంవత్సరం ఉగాదిని ఏప్రిల్ 9వ తేదీ చేసుకోవాలని పటాన్‌చెరు పట్టణంలోని పుర ప్రముఖుల సమావేశంలో నిర్ణయించారు. సోమవారం పట్టణంలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, మాజీ ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు హాజరయ్యారు. వేద పండితుల సూచనలకు అనుగుణంగా..మార్చి 25న హోలీ, ఏప్రిల్ 9న ఉగాది, ఏప్రిల్ 15 నుంచి 19 వరకు శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ జైపాల్, మాజీ కార్పొరేటర్లు శంకర్ యాదవ్, సపాన్‌దేవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బస్తీదర్శన్



సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని పాషాకాలనీలో సోమవారం బస్తీదర్శన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకు వచ్చారు. చెరువుకట్టపై వెళ్లే మార్గంలో ఉన్న ఓపెన్ డ్రైన్‌లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. బోర్ నీరు రావడం లేదని మహిళలు తెలిపారు. అనంతరం కార్పొరేటర్ పుష్ప మాట్లాడుతూ కాలనీవాసులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను త్వరలో పరిష్కారిస్తామని తెలిపారు .కార్యక్రమంలో నాయకులు కిరణ్‌గౌడ్, రాములు, సంతోష్, అలీబాబా పాల్గొన్నారు.

ప్రజావాణి.. 7 వినతులు

హఫీజ్‌పేట్: చందానగర్ సర్కిల్ –21 కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం ఉపకమిషనర్ వంశీకృష్ణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 07 వినతిపత్రాలు అందగా, 6 టౌన్ ప్లానింగ్‌కు, మరొకటి ఇంజినీరింగ్ సెక్షన్‌కు సంబంధించిన ఫిర్యాదు చేశారన్నారు. వీటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు.

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో సోమవారం డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో 8 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి 5 దరఖాస్తులు రాగా, ప్రాపర్టీ ట్యాక్స్‌లకు సంబంధించి 3 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

తహసీల్దార్‌కు వినతి



తహశీల్దార్ వెంకారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నడిగడ్డ తండావాసులు

శేరిలింగంపల్లి: మియాపూర్ సర్వే నంబర్ 28లో సీఆర్‌పీఎఫ్ క్యాంపు సిబ్బంది చేపట్టిన అదనపు నిర్మాణాలను వెంటనే నిలిపివేయాలని నడిగడ్డ తండావాసులు శేరిలింగంపల్లి తహశీల్దార్ వెంకారెడ్డిని సోమవారం కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా తండావాసి ఇస్లావత్ దశరథ్‌నాయక్ మాట్లాడుతూ దశాబ్దాలుగా బడుగు, బలహీన వర్గాల ప్రజలు నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నారని, వారికి మౌలిక వసతులు కల్పించి చట్టబద్ధత కల్పించాలని కోరారు. సీఆర్‌పీఎఫ్ నిర్మాణాలను వెంటనే నిలిపివేయాలని రెవెన్యూ అధికారులను కోరారు. కార్యక్రమంలో నడిగడ్డా తండావాసులు హన్మనాయక్, కృష్ణ నాయక్, వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు పరిశీలన



అన్నపూర్ణ ఎన్‌క్లేవ్‌లో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మంజుల

హఫీజ్‌పేట్: చందానగర్ డివిజన్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని అన్నపూర్ణ ఎన్‌క్లేవ్‌లో చేపట్టిన సీసీ రోడ్డు పనులను స్థానికులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్‌ఎస్ నాయకురాలు వరలక్ష్మి, కాలనీవాసులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం



కార్యాలయం ప్రారంభోత్సవంలో వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్ సునీత మహేందర్‌రెడ్డి, జగదీశ్వర్ గౌడ్

హఫీజ్‌పేట్: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్ పట్నం సునీత మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాత్రి కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్ నగర్ బస్తీలో నూతనంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని నియోజకవర్గ ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో రెట్టించిన ఉత్సాహంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు మహిపాల్‌యాదవ్, నల్ల సంజీవరెడ్డి, వీరేందర్‌గౌడ్, ఇలియాస్ షరీఫ్, సాంబశివరావు, సాజిద్, మునాఫ్ ఖాన్ పాల్గొన్నారు.

పీస్ కమిటీ సమావేశం



మాట్లాడుతున్న మియాపూర్ ఏసీపీ నర్సింహారావు

హఫీజ్‌పేట్: రంజాన్ మాసంను పురస్కరించుకుని సోమవారం న్యూ హఫీజ్‌పేట్‌లోని ఫ్రెండ్స్ ఫంక్షన్ హాల్‌లో రంజాన్ మాసం పీస్ కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మియాపూర్ ఏసీపీ నర్సింహారావు మాట్లాడుతూ రంజాన్ మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎవరికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దీక్ష చేసుకోవాలన్నారు. ప్రజలందరూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మియాపూర్ ఎస్‌హెచ్‌ఓ దుర్గా రామలింగ ప్రసాద్, డీఐ అక్రం బాబా, ఎస్‌లు దశరథ్, రాజు, వివిధ బస్తీల ముస్లింలు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ర్యాలీ

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారంలో బీజేపీ నాయకులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షులు జగన్‌రెడ్డి ఆధ్వర్యంలో మోడీకి ఫ్యామిలీ మేమంటే ర్యాలీ చేపట్టారు. అనంతరం జగన్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలోని 140 కోట్ల ప్రజలు మోడీ కుటుంబమే అని చెప్పేందుకు గ్రామాల్లో ఈ ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెరువు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు జగదీశ్వర్‌గౌడ్, శ్రీకాంత్

హఫీజ్‌పేట్: మాదాపూర్ డివిజన్ పరిధిలోని మీదికుంట చెరువు సుందరీకరణ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. సోమవారం మీదికుంట చెరువు అభివృద్ధి పనులకు కార్పొరేటర్లు జగదీశ్వర్ గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్‌లతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే సీడీపీ నిధులు, ఫౌంటేన్ హెడ్ ద గ్లోబల్ స్కూల్ యాజమాన్యం, మాతృశ్రీ నగర్ సంక్షేమ సంఘాల భాగస్వామ్యంతో మీదికుంట చెరువు అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఫౌంటేన్ హెడ్ ద గ్లోబల్ స్కూల్ ఫౌండర్ అండ్ చైర్‌పర్సన్ మేఘన, శ్రీధర్, లేక్ మాన్ ఆఫ్ ఇండియా ఆనంద్ మాలిగావద్, చైతన్య, రాము, కల్పన, సుధా, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

హఫీజ్‌పేట్: చందానగర్ డివిజన్ పరిధిలోని అంబేద్కర్ కల్యాణ మండపంలో సోమవారం 10వ తెలంగాణ రాష్ట్ర క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ –2024 ముగింపు వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ హాజరయ్యారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చందానగర్ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్‌కుమార్, నాయకులు మహమ్మద్ బేగ్, అక్బర్‌ఖాన్, ప్రవీణ్‌రెడ్డి, యూసుఫ్, నరేందర్ బల్లా, అంజద్ పాషా, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ వ్యవస్థకు మహిళలు దూరం కావొద్దు

జేఎన్‌టీయూ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి సింధు

రాయదుర్గం: భారతదేశం త్వరలో సాధించాలనుకునే పది ట్రిలియన్ ఆర్థికాభివృద్ధి ముఖ్యంగా మహిళలతోనే సాధ్యమని జేఎన్‌టీయూ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి సింధు పేర్కొన్నారు.సోమవారం గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలోని చాణక్య హాల్‌లో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆమెను ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జీ రామేశ్వరరావు ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వ్యవసాయం, నిర్మాణ రంగం, మ్యానుఫాక్చరింగ్ రంగాలలో ప్రస్తుతం భారత మహిళలు దూసుకుపోతున్నారన్నారు. ఇప్పటికే దేశంలోని ఐటీరంగంలో సగానికి పైగా మహిళలే ఉన్నారన్నారు. ఎన్ని రంగాల్లో అభివృద్ధి సాధించినప్పటికీ కుటుంబ వ్యవస్థకు మహిళలు దూరం కావద్దన్నారు. ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచంలో స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమేనని, స్త్రీ లేనిదే పురుషుడు లేడని, అభివృద్ధిలో ఇద్దరూ సమానమేనన్నారు.కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ పోస్టు గ్రాడ్యుయేట్ స్టడీస్ ప్రిన్సిపల్ డాక్టర్ జగన్‌మోహన్ రావు,ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి డాక్టర్ లీల, డాక్టర్ రమణి, కాలేజ్ చీఫ్ లక్ష్మీకాంతరావు ప్రసంగించారు. కార్యక్రమంలో ఎస్కీ అధికారులు, ఉద్యోగులు,విద్యార్థులు పాల్గొన్నారు.

జపాన్‌ను సందర్శించిన హెచ్‌సీయూ పరిశోధక బృందం



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిశోధక బృందం జపాన్‌ను సందర్శించింది. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లోని ప్లాంట్ సైన్స్ విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎస్ రాజగోపాల్ నాయకత్వంలోని పరిశోధక బృందం సాకురా సైన్స్ ఎక్స్‌ఛేంజ్ ప్రోగ్రామ్ అనే ప్రతిష్టాత్మక కార్యక్రమానికి ఎంపికయ్యారు. ఇది జపనీస్ ప్రభుత్వ శాస్త్రీయ విభాగం సహకారాన్ని ప్రోత్సహిస్తుంది. మార్చి 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు జపాన్‌లో పర్యటించి సోమవారం క్యాంపస్‌కు చేరుకున్నారు. ఈ కార్యక్రమాన్ని జపాన్‌లోని ఒకాయామా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ యుచిరో తకాహషి నాయకత్వం వహించారు. హెచ్‌సీయూ ప్రొఫెసర్లు ఎస్ రాజగోపాల్, డాక్టర్ వెంకటేశ్వర రావు, బృందంలోని సభ్యులు పవిత్రా రామచంద్రన్, జ్యోతిరంజన్‌రాత్, పులిమామిడి భరత్, జెరోమ్ జేవియర్, విజయ్ శ్రీనివాస్ లావుడియా, శ్రియా శర్మ, నమ్రతదూబే, శివ నాగసాయి దామరాజు వారం రోజులపాటు పర్యటించారు. కిరణజన్యసంయోగక్రియ, పరిశోధన, సరిహద్దులను అధిగమించడం, సహకార వృద్ధిని పెంపొందించే పరిశోధనలో పాల్గొన్నారు.

ప్రజా పాలన కాంగ్రెస్‌కే సాధ్యం

పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌గౌడ్



ఎన్టీఆర్‌కాలనీలో మాట్లాడుతున్న జగదీశ్వర్‌గౌడ్

రాయదుర్గం: ప్రజా పాలన కాంగ్రెస్‌కే సాధ్యం అని, మాట ఇస్తాం..చేసి చూపిస్తాం.. అభివృద్దే ప్రధాన లక్ష్యం అని ఆ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జీ జగదీశ్వర్‌గౌడ్ స్పష్టం చేశారు. గచ్చిబౌలి డివిజన్‌లోని ఎన్‌టీఆర్ కాలనీవాసులు నర్సింహరాజు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు 300 మందికి పైగా కాంగ్రెస్ నాయకులు పల్లపు సురేందర్, శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలను కప్పి జగదీశ్వర్‌గౌడ్ ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చేవెళ్ళ పార్లమెంటు నియోజకవర్గం పరిధి శేరిలింగంపల్లిలో భారీ మెజార్టీని అందించడం మన బాధ్యత అని అన్నారు. అభివృద్ధి కోసం తగిన ప్రణాళికలు రూపొందిస్తున్నామని, జిల్లా మంత్రి దృష్టికి తీసుకెళ్ళి మంజూరు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంజీవరెడ్డి, వీరేందర్‌గౌడ్, విశ్వనాథమ్, అఫ్జల్, గోపాల్, కృష్ణ, సత్యం, నారాయణ, సూర్య, గౌస్ పాల్గొన్నారు.

నార్మ్‌లో ప్రత్యేక కోర్సులు ప్రారంభం

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (నార్మ్)లో నాబార్డ్ సహాయంతో ప్రత్యేక కోర్సులను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమానికి మహారాష్ట్ర నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ రష్మీ దారద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కోర్సులతో విశ్లేషణాత్మక సమస్య పరిష్కారం వ్యవస్థాపక నైపుణ్యాలు, మార్కెటింగ్ వ్యూహాత్మక నిర్వహణ వంటివి నేర్చుకునే అవకాశం ఉంటుందన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థలు ఎదుర్కొంటున్న సవాళ్లు, స్థిరమైన వృద్ధికి ఈ అడ్డంకులను అధిగమించడంలో నాయకత్వం యొక్క కీలక పాత్రను ఆమె నొక్కిచెప్పారు. కార్యక్రమంలో ఐసీఏఆర్–నార్మ్ డైరెక్టర్ జనరల్ శ్రీనివాస్‌రావు,సైంటిస్ట్ సెంథిల్, శిక్షణ పొందిన రైతులు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఎపీఓలు, నాబార్డ్, నార్మ్ అధికారులు పాల్గొన్నారు.

అంతర్ కళాశాలల పోటీలు షురూ



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ వెంకటరమణ



విద్యార్థి వేస్తున్న చిత్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అంతర్ కళాశాలల సాంస్కృతిక, సాహిత్య పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రతిభను కనబర్చేందుకు ఇది మంచి వేదిక అని అన్నారు. విద్యార్థులు పోటీల్లో పాల్గొనడం వలన సహకారం, సమన్వయం, నెట్‌వర్కింగ్ వంటివి అలవాటు చేసుకుంటారని అన్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన వారు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అధికారులు నరేందర్‌రెడ్డి, డాక్టర్ సీమ, సత్యనారాయణ, బి విజయలక్ష్మి, వర్సిటీ అబ్జర్వర్ డాక్టర్ త్రివేణి పాల్గొన్నారు.

ఎస్కీకి గోల్డెన్ పీకాక్ అవార్డు



అబుదాబిలో గోల్డెన్ పీకాక్ అవార్డును స్వీకరిస్తున్న ఎస్కీ డైరెక్టర్ డా. రామేశ్వరరావు

రాయదుర్గం: ప్రతిష్టాత్మకమైన గోల్డెన్ పీకాక్ అవార్డు–2024ను గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు స్వీకరించారు. అబుదాబిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా సోమవారం గచ్చిబౌలిలోని ఎస్కీ క్యాంపస్‌లో అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రామేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచం ఎదుర్కొంటున్న పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులపై ఢిల్లీ కేంద్రంగా పనిచేసే ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ ఏటా నిర్వహించే ఈ గోల్డెన్ పీకాక్ అవార్డును ఈ ఏడాదికి ఎస్కీని ఎంపిక చేశారన్నారు. ఈ అవార్డు స్వీకరణతో మనపై బాధ్యత మరింత పెరిగిందని, భవిష్యత్తులో చేపట్టే ప్రతి కార్యక్రమం, శిక్షణను మరింత బాధ్యతాయుతంగా నిర్వహించాలన్నారు. అందరూ సమష్టిగా పనిచేస్తే విజయం సాధిస్తామనడానికి ఈ అవార్డు రావడమే నిదర్శనమన్నారు.

డివిజన్ల అభివృద్ధికి పెద్దపీట

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: జీహెచ్‌ఎంసీ పరిధిలోని డివిజన్ల అభివృద్ధికి ప్రణాళికబద్ధంగా నిధులు కేటాయిస్తూ అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని జెపి కాలనీలో 68 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్ల పనులకు సోమవారం స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. వ్యవసాయ మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ విజయకుమార్, బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు అఫ్జల్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

అక్రమ నిర్మాణాల కూల్చివేత



జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో గల 284 సర్వేనంబర్‌లోని ప్రభుత్వ భూమిలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను సోమవారం రెవెన్యూ అధికారులు కూల్చివేయించారు. తహసీల్దార్ బిక్షపతి ఆదేశాల మేరకు ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ, సర్వేయర్‌ల ఆధ్వర్యంలో నిర్మాణాలను కూల్చివేయించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

ఆర్ట్‌గ్యాలరీలో చిత్రప్రదర్శన ప్రారంభం



మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో ఆకట్టుకుంటున్న చిత్రాలు



మాదాపూర్: అంతరించిపోతున్న రాళ్లను రక్షించుకోవాలని ఆర్ట్‌గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మీ పేర్కొన్నారు. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన సెంటినెల్స్ ఆఫ్ హైదరాబాద్ పేరిట చిత్రప్రదర్శనను సోమవారం సేవ్ ది రాక్స్ సొసైటీ జనరల్ సెక్రటరీ ఫరూక్ ఖాదర్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన రాళ్లను అబివృద్ధి పేరుతో ధ్వంసం చేస్తున్నారన్నారు. సహజసిద్ధంగా ఏర్పడిన రాళ్ళను కాపాడాలన్నారు. 15 మంది చిత్రకళాకారులు వేసిన 88 చిత్రాలను ప్రదర్శనలో ఉంచినట్టు తెలిపారు. వివిధ ఆకృతులలో ఏర్పడిన రాళ్ళ చిత్రాలను సందర్శకులు కొనియాడారు. ఈ ప్రదర్శన ఈనెల 13వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. చిత్రకళాకారులు ఆదిత్యమన్, ప్రియాంకదామరాజు, రచితగుప్త, సిమ్రాన్‌దిలోన్, స్మితారానే, స్నేహసుబ్రమణియన్, రేష్మీమెహత, శ్రీవిద్య విష్ణుబొట్ల తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

- కాటేదాన్ నుండి కర్ణాటకకు
- లారీలో తరలిస్తున్న 35 టన్నుల బియ్యం పట్టుకున్న సీసీఎస్ పోలీసులు



పటాన్‌చెరు టౌన్: లారీలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సీసీఎస్ పోలీసులు పటాన్‌చెరు మండల పరిధిలో రుద్రారం గ్రామ సమీపంలోని రిమ్ జిమ్ దాబా వద్ద పట్టుకున్నారు. సీసీఎస్ పోలీసులు, సివిల్ సప్లై అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్ కాటేదాన్ నుండి కర్ణాటక లారీలో అక్రమంగా 35 టన్నుల 475 కిలోల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా కర్ణాటక పాసింగ్‌కి చెందిన లారీని ఆదివారం రాత్రి పట్టుకున్నారు. లారీలు సీజ్ చేసి, రేషన్ బియ్యాన్ని పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇద్దరిపై కేసు నమోదు చేశారు. లారీ డ్రైవర్ సాగర్ బాయ్ వాగ్లే, పూర్మార్ వక్కలను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.